క్లుప్తంగా

మీసేవ కేంద్రం ప్రారంభం



కృష్ణా: ప్రజలకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కున్సీ గ్రామానికి మీసేవ కేంద్రాన్ని మంజూరు చేసినట్లు మాజీ సర్పంచ్ సోమశేఖర్‌గౌడ్ అన్నారు. మాజీ ఎంపీటీసీ రాంచందర్, అంజప్పగౌడ్‌తో కలిసి సోమవారం కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రజలకు మీ సేవా కేంద్రం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సురేష్, శరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డీటీగా బాధ్యతలు స్వీకరణ



మద్దూరు: మద్దూరు డిప్యూటీ తహసీల్దార్‌గా కిరణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇదే మండలంలో తహసీల్దార్(ఎఫ్ఏసీ) విధులు నిర్వహించి ఇక్కడి నుంచి కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. లాంగ్‌లీవ్‌లో ఉన్న కిరణ్‌కుమార్ మళ్లీ కలెక్టరేట్‌లో రిపోర్టు చేయగా డీటీగా వచ్చినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దూరు: మద్దూరు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని మద్దూరు పట్టణం, రెనివట్ల, పెదిరిపాడ్, ఖాజీపూర్, నాగంపల్లి, చితల్‌దిన్నే గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ నిరంజన్‌దాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగ దారులు సహకరించాలని కోరారు.

హైందవ సంస్కృతిని కాపాడుకుందాం

నర్వ: హిందూ ధర్మాన్ని, హైందవ సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని ధర్మ ప్రచారకులు అన్నారు. సోమవారం నర్వ మండల కేంద్రంలో హిందూ ధర్మ జాగరణ రథయాత్ర కొనసాగింది. రథయాత్రకు గ్రామ విశ్వహిందూ, భజరంగ్ దళ్, భజన మండలి, దేవాలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. గ్రామ పురవీధుల గుండా రథయాత్ర నిర్వహించి ప్రజలనుద్దేశించి వక్తలు మాట్లాడారు. హైందవ ధర్మ సంస్కృతి విశిష్టత, సనాతన ధర్మం ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి, రాములు, కొండన్న పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ కార్మికుల నిరసన

నారాయణపేట: ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని మంగళవారం ఆర్టీసీ డిపో ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వెంకట్రామరెడ్డి, జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు . తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని, ఆర్టీసీలో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలని కోరుతు రాష్ట్ర వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపోల ఎదుట నిరసనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

రేపు ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మరికల్: మండలంలోని మాధవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆయలంలో బుధవారం ఎల్లమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్ని ప్రతిష్ఠ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



కృష్ణా: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దుతున్నట్లు ముడుమాల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శేఖర్ అన్నారు. గుర్తింపు కార్డులతో పాటు యూనిఫామ్స్, టై, బెల్టు, బూట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. అన్ని రకాల సేవలతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హామీ మేరకు సన్నాలకు బోనస్



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నర్వ: తెలంగాణ ప్రజా ప్రభుత్వం గత ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన సన్న వడ్లకు రూ.500 బోనస్ హామీని నెరవేర్చిందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చెన్నయ్యసాగర్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. సోమవారం పీఏసీఎస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో పీఏసీఎస్ ద్వారా 5 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి వడ్లను కొనుగోలు చేస్తున్నామన్నారు. మండలంలోని నర్వ, పెద్దకడ్మూర్, రాయికోడ్, చిత్తనూర్, కన్మనూర్ కేంద్రాల ద్వారా రైతుల నుంచి వడ్లను కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మండలానికి కేటాయించిన రెండు రైస్ మిల్లుల ద్వారా 5,851బస్తాలను దాదాపు 2,034 మెట్రిక్ టన్నులు కొనుగోలుకు సిద్ధం చేశామన్నారు. ముందుగా అన్ని గ్రామాలకు దాదాపు 60 వేల గన్నీ బ్యాగులు రైతులకు అందజేసినట్లు తెలిపారు. మరో 30 వేల గన్నీ బ్యాగులను సిద్ధంగా ఉంచామన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.2320 విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మన్న, కృష్ణారెడ్డి, విష్ణు వర్ధన్, శ్రీనివాస్ రెడ్డి, వివేక్‌వర్ధన్‌రెడ్డి, సంజీవారెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉమామహేశ్వర వ్రతం



హారతి ఇస్తున్న మహిళలు

నారాయణపేట రూరల్ : కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలువురు భక్తులు ఉమామహేశ్వర వ్రతాలు నిర్వహించారు. పుట్టమన్నుతో శివలింగాన్ని చేసి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పాలంకరణ, మహా మంగళహారతి తదితర పూజా క్రతువులు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య, అర్కంచి రవికుమార్, మహాలక్ష్మి, డాక్టర్ విరోజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి..

సంకటహర చతుర్థి పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని సింగార్ బేస్ శ్రీ శివలింగేశ్వర దేవాలయంలో గణనాథుని మూల విరాట్‌కు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పంచామృతాభిషేకం, అర్చన, మహా మంగళహారతి తదితర క్రతువులు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వేడుకగా కార్తీక దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

మరికల్: కార్తీక మాసం సందర్భంగా ఉసిరి చెట్లకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం మరికల్‌లో మహిళలు ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించి వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని నగరేశ్వర, వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయంలో కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు వివిధ రూపాల్లో దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని దయానంద విద్య మందిర్ పాఠశాలలో సోమవారం షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సభ్యులు బాలరాజు మాట్లాడుతూ... మహిళల రక్షణ చట్టాలు, షీటీమ్ నిర్వహిస్తున్న విధులు, రక్షణ, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీ టీమ్స్ యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిదని వివరించారు. చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిస కావొద్దన్నారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆడపిల్లలపై వేధింపులు జరిగితే వెంటనే నారాయణపేట షీటీమ్ నంబర్ 8712670398 లేదా డయల్ 100కి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో భరోసా సెంటర్ టీమ్ సభ్యులు దేవి, షీటీమ్ పోలీసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సవాల వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఊట్కూరు: ఊట్కూరులో శాల్యం చర్చి ఆధ్వర్యంలో సోమవారం యేసుక్రీస్తు నామధ్యాన మహోత్సవాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చర్చి చైర్మన్ జనార్ధన్ మాట్లాడుతూ.. డిసెంబర్ 10 నుంచి మూడు రోజులపాటు ధ్యాన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రకాష్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ్‌రెడ్డి, ఎల్కోటి నారాయణరెడ్డి, విజ్ఞేశ్వర్ రెడ్డి, గోపాల్, బలరాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఎన్నో ప్రయోజనాలు



విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

మక్తల్: ప్రతి విద్యార్థి కరాటే నేర్చుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కరాటే నిర్వాహకుడు సలాంబిన్ ఉమర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఆదివారం ఉమ్మడి జిల్లాలోని 1,400 మంది విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కోళ్ల వెంకటేష్, సఫీ, స్వాతి, మహ్మద్ బిలాల్, సంశుద్దీన్, అమ్రేష్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



ఆర్థిక సహాయం చేస్తున్న మిత్రులు

ధన్వాడ: ధన్వాడ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల 2005–06 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల మిత్రుడు చెక్క బాలరాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో బాలరాజ్ పదో తరగతి మిత్రులు రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు.బాధిత కుటుంబానికి తోడుగా ఉంటామని భరోసానిచ్చారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



నర్వ: రామకృష్ణ, వివేకనంద సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నర్వ యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ డెంటల్ హాస్పిటల్ పీజీ విద్యార్థులు డా.జితేందర్ నేతృత్వంలో 120 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి చికిత్స చేశారు. కార్యక్రమంలో నర్వ మండల రామకృష్ణాసేవా సమితి సభ్యుడు నరేష్, ఉపాధ్యాయులు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పొంచి ఉన్న ప్రమాదం



మాగనూర్: మండల పరిధిలోని తళంకేరి గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఇంటర్‌నెట్ కేబుల్‌కు సంబంధించిన వైరింగ్ కోసం తీసిన గుంత ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. చిన్నారులకు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా స్పందించడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.

నరేందర్ సేవలు మరువలేనివి



ధన్వాడ: ఉత్తమ ఉపాధ్యయుడిగా అవార్డు పొంది విద్యార్థులకు సొంత నిధులతో సేవలు అందిస్తున్న కెంచె నరేందర్ సేవలు మరువలేనివని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని అన్నారు. సోమవారం నరేందర్ మాధవిల పెళ్లిరోజు సందర్భంగా మందిపల్లితండా పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేశారు. ఇలాంటి సేవలు ఎన్నో చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ గాయత్రి, కాంప్లెక్స్ ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మీనారాయణాచారి, మాజీ హెచ్‌ఎం రమేష్‌శెట్టి తదితరలు పాల్గొన్నారు.

సర్వేలో తప్పలకు అవకాశమివ్వొద్దు



మాగనూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులకు అవకాశం ఉండకూడదని ఎంపీడీవో రహమతుద్దీన్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను 51 మంది ఎన్యుమరేటర్లు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సర్వే పూర్తి చేసిన వారి నుంచి ఫామ్‌లు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి



శిక్షణ శిబిరాన్ని సందర్శిస్తున్న నాయకులు

మక్తల్: మండలంలోని కర్ని బాలుర ఉన్నత పాఠశాలలో పీడీ రూప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 43వ జాతీయ జూనియర్ బాలికల ఖోఖో శిబిరాన్ని సోమవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆశిరెడ్డి, ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాల సందర్శించారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి మక్తల్ తాలుకాకు పేరు తీసుకురావాలని కోరారు. శిక్షణ శిబిరంలో 20 మంది బాలురు, 20 మంది బాలికలు 10 రోజుల పాటు శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ మారుతిగౌడ్, వెంకటేష్‌శెట్టి, ఆనంద్, వసంత్‌గౌడ్ తదితరలు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యం పెంపునకు కృషి



మెటీరియల్ అందజేస్తున్న వినోద్‌కుమార్

మాగనూర్: విద్యార్థుల సామర్థ్యం పెంపునకు తన వంతు కృషి చేస్తామని బైరంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వినోద్‌కుమార్ అన్నారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తెలుగులో చదవడం, రాయడంలో పడుతున్న ఇబ్బందులను గమణించి వారికి సొంతంగా రూ.3 వేలతో తెలుగు, ఇంగ్లీష్, గణితం వర్క్ బుక్, మెటీరియల్‌ను అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు ఆయన కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



రుణాలపై వివరణ ఇస్తున్న ఐకేపీ సిబ్బంది

ధన్వాడ: మహిళలు ఆర్థికంగా అన్ని రంగాల్లో ఎదగాలని ఐకేపీ ఏపీఎం హన్మంతు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో మండల మహిళా సమాఖ్య సంఘాలకు సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రుణాలపై వివరించారు. ప్రస్తుతం పెరటి కోళ్లు, పాల ఉత్పత్తులు, మదర్ యూనిట్స్ కింద మహిళలకు రుణాలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మహిళా సంఘాలు వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదాగలని కోరారు. కార్యక్రమంలో అశోక్, సుల్తాన్న, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆరాధన మహోత్సవాలు



గాయత్రి యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట టౌన్: పట్టణంలోని సుభాష్ రోడ్డులోని సద్గురు అవధూత నరసింహ స్వామి 133వ ఆరాధన మహోత్సవాలను సోమవారం మఠం కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగాగా కాగడ హారతి, మహా రుద్రాభిషేకం, గణపతి నవగ్రహ పూజ, గురు గాయత్రి యజ్ఞం, నైవేద్యం మహా మంగళహారతి, అన్నప్రాసద వితరణ చేపట్టారు. గుజరాత్‌కు చెందిన భరుచ్ మాత, విజయవాడ కుంచెందిన బాల అవధూత ప్రకాశనంద సరస్వతి స్వామి ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో మఠం కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు చూపిన మార్గంలో నడవాలి



కనకదాసు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కురువ సంఘం నాయకులు

కృష్ణా: ప్రతి ఒక్కరూ భక్త కనకదాసుడు చూపిన మార్గంలో నడుచుకోవాలని కురువ కుల సంఘం నాయకులు మాలింగప్ప, నాగరాజులు పిలుపునిచ్చారు. సోమవారం భక్త కనకదాసు 537వ జయంతి సందర్భంగా గ్రామ పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించి.. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనకు కృష్ణునిపై ఉన్న భక్తి గురించి వివరించారు. కార్యక్రమంలో సురేష్, బాల్‌రాజ్, రాజు, సాబులు, సాయిబణ్ణ, భీరప్ప, శంఖర్, మహాదేవ్, మల్లప్ప శ్రీకాంత్, రెడ్డి, కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో నిత్యావసరాలు దగ్ధం



పూర్తిగా దగ్ధమైన సామగ్రి

మరికల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధమైన ఘటన మాధవరంలో చోటు చేసుకుంది. మరికల్ మండలం మాధవరం గ్రామానికి చెందిన కుర్వ దేవరి ఇంటి మణెమ్మ సోమవారం వంట పనులు ముగించుకుని ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లింది. ఈ నేపథ్యంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగడంతో చుట్టు పక్కల వారు గమనించి విద్యుత్ స్తంభం నుంచి వచ్చిన తీగలు తొలగించారు. రూ.10 వేలు నగదుతో పాటు పింఛన్, పాస్ పుస్తకం, నిత్యావసరాలు దగ్ధమైనట్లు వృద్ధురాలు కన్నీరుమున్నీరైంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నరేందర్

ఆత్మకూర్: సైబర్ నేరగాళ్లతో యువత, విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నరేందర్ సూచించారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సైబర్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటర్‌నెట్ వినియోగం పెరిగిన తర్వాత సైబర్ నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అపరచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు ఓటీపీలు, బ్యాంకు వివరాలు చెప్పొద్దని సూచించారు. మెసేజ్‌ల రూపంలో వచ్చే అనవసర లింకులను క్లిక్ చేయరాదని, అలాంటి వాటి ద్వారా డబ్బులు పోగొట్టుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఆత్మకూర్: మండలంలోని కత్తేపల్లి గ్రామానికి చెందిన బైని శంకర్ ఆగస్టు 15న కొత్తకోటకు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా.. సెల్‌ఫోన్ పడిపోయింది. బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని గుర్తించి హైదరాబాద్‌లో రికవరీ చేసి బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు.

శబరికి బయలుదేరిన దీక్షాపరులు

ఆత్మకూర్: పట్టణంలోని వేద పండితుడు మదనాపురం గోపాల కృష్ణమూర్తి గురుస్వామి ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప మాలధారులు ఇరుముడి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం దీక్షాపరులు శబరిమలకు బయలుదేరారు.